సాక్షి అనకాపల్లి

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025

విశాఖ చేరుకున్న మహిళా క్రికెటర్లు



స్నేహ్, దీప్తి





రేణుక



రీచా



ప్రతీక

విశాఖ స్పోర్ట్స్: భారత మహిళల క్రికెట్ జట్టు సోమవారం విశాఖ చేరుకుంది. ప్రత్యేక విమానంలో కొలంబో నుంచి విశాఖ వచ్చిన మహిళల జట్టుకు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. మహిళా క్రికెటర్లతో ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. టోర్నీలో భాగంగా ఐదు వన్డే మ్యాచ్‌లకు డా.వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. భారత్ జట్టు ఈనెల 9న దక్షిణాఫ్రికాతోను, 12న ఆస్ట్రేలియాలతో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్నాయి. మహిళల ప్రపంచ కప్‌కు భారత్ తొలిసారిగా 1997లో కోల్‌కతా వేదికగా ఆతిథ్యమివ్వగా, ఇప్పుడు శ్రీలంకతో కలిసి మరోసారి నిర్వహిస్తోంది.

యాప్ రోగం

- ఏబీహెచ్‌ఏ యాప్ పనిచేయకపోవడంతో కేజీహెచ్‌లో ఇబ్బందులు
- ఓపీ టికెట్ల కోసం రోగుల పడిగాపులు





కేజీహెచ్ ఓపీ టికెట్ల జారీలో సర్వర్ సమస్యతో క్యూలో ఇబ్బంది పడుతున్న రోగులు

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో సోమవారం రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ యాప్ (ఏబీహెచ్‌ఏ) ద్వారా ఓపీ టికెట్ల జారీలో ఆన్‌లైన్ సర్వర్ సమస్య కారణంగా జాప్యం జరిగింది. సోమవారం, ముఖ్యంగా దసరా పండుగ తర్వాత కావడంతో, ఓపీకి రోగుల సంఖ్య భారీగా పెరిగింది. నిత్యం 1200 నుంచి 1300 టికెట్లు జారీ చేసే కౌంటర్ల వద్ద సోమవారం దాదాపు 1800 మందికి ఓపీలు, 80 మందికి కే-షీట్‌లు జారీ చేశారు. ఆరు కౌంటర్లు రోగులు, వారి బంధువులతో కిక్కిరిసిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు రద్దీ కొనసాగింది.

'యాప్'సోపాలు

ఒకవైపు సర్వర్ సమస్యతో పాటు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఏబీహెచ్‌ఏ యాప్ ద్వారా టికెట్లను జారీ చేయడంలోనూ రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులు స్మార్ట్‌ఫోన్ లేక, యాప్ డౌన్‌లోడ్ చేయలేక గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సిగ్నల్ లేకపోవడం, ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, వేలిముద్రలు సక్రమంగా పడకపోవడం వంటి కారణాల వల్ల యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియ ఆలస్యమై, రోగులు మరింత ఎక్కువ సమయం కౌంటర్ల వద్ద నిరీక్షిస్తున్నారు. ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో టికెట్లు జారీ నిలిచిపోయి, కౌంటర్ల వద్ద రద్దీ పెరగడంతో రోగులు, వారి బంధువులను అదుపు చేయడం సెక్యూరిటీ సిబ్బందికి కూడా కష్టమవుతోంది.

ఆకాశంలో అద్భుతం

పౌర్ణమి అంటేనే చందమామ నిండు పున్నమితో దేదీప్యమానంగా కనిపిస్తుంది. మరి.. సూపర్‌మూన్ అంటే ఎలా ఉంటుందో తెలుసా.? సోమవారం కనిపించిన జాబిలిని చూస్తే.. ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. సాధారణ పరిభాషలో సోమవారం శరత్‌పూర్ణిమ అని శారదీయ పౌర్ణమి అని పిలుస్తారు. ఈ రోజున భూమికి చాలా దగ్గరగా చంద్రుడు వచ్చాడు. అందుకే.. ఎప్పుడూ పౌర్ణమికి కనిపించే చందమామలా కాకుండా.. 14 శాతం పెద్దగా.. 30 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించాడు. దీన్నే హార్వెస్ట్‌మూన్ అని కూడా పిలుస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం.. శరత్ పూర్ణిమ రోజున చంద్రుని కిరణాలు అమృతంతో సమానమని అంటారు. అందుకే.. ఈ రోజున ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పవిత్రమైన రోజుగా భావిస్తారు. –సాక్షి,ఫొటోగ్రాఫర్,విశాఖ



న్యూస్‌రీల్

రెండో రోజూ నిర్బంధంలో అప్పలరాజు



అప్పలరాజును అడ్డుకుంటున్న ఎస్‌ఐ

ఎస్.రాయవరం: నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కు ఆందోళనకారుల వద్దకు వెళ్లకుండా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజును రెండో రోజు సోమవారం కూడా గృహ నిర్బంధం చేశారు. బల్క్‌డ్రగ్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని 23 రోజులుగా నిరసన తెలుపుతుంటే వారి గోడు వినకుండా.. మద్దతు తెలుపుతున్న తమను నిర్బంధించడం తగదని అప్పలరాజు ఈ సందర్భంగా దుయ్యబట్టారు. ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పనులు అడ్డుకుంటే నేరస్తుల్లా చూస్తున్నారని ఆక్షేపించారు.

కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ



కోటవురట్లలో ఆవిష్కరించిన మొల్ల విగ్రహం

కోటవురట్ల: స్థానిక కుమ్మరి వీధిలో కవయిత్రి మొల్ల విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. విగ్రహాన్ని జానకి హరి వితరణ చేయగా.. కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గానికి చెందిన కుమ్మరి శాలివాహన డైరెక్టర్ ఎం.విజయకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కవయిత్రి మొల్ల రచనలు సరళ పద్ధతిలో రమణీయంగా ఉంటాయన్నారు. మొల్ల రచించిన రామాయణం విశేష ప్రాచుర్యం పొందిందన్నారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల 5 రోజుల్లోనే రామాయణాన్ని రచించి అబ్బురపరిచారన్నారు. కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని నిర్మాణానికి సహకరించాలని స్థానికులు విజయకుమారిని కోరారు. స్పందించిన ఆమె శాలివాహన సంఘ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జానకి హరి, జానకి శ్రీను, శాలివాహన కమిటీ జిల్లా అధ్యక్షుడు పి.అప్పలకొండ, వైస్ ప్రెసిడెంట్ శ్రీను, కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ దాసరి వెంకటరావు, ఉప సర్పంచ్ గవ్వా రాధాకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

యువకుడు గల్లంతు



పి.అశోక్(ఫైల్)

పాయకరావుపేట: పాల్మన్‌పేట సముద్ర తీరంలో స్నేహితులతో సరదాగా స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. మెరైన్ పోలీసు ఎస్‌ఐ డి.రత్నశేఖర్, స్థానిక ఎస్‌ఐ పురుషోత్తం తెలిపిన వివరాలు.. కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామం నుంచి ఆటోలో 11 మంది యువకులు సోమవారం సముద్ర స్నానాలకు వెళ్లారు. స్నానాలు చేసి ఒడ్డుకు వచ్చే క్రమంలో పి.అశోక్, దుర్గాప్రసాద్ కెరటాల తాకిడికి కొట్టుకుపోయారు. దుర్గాప్రసాద్‌ను స్థానికంగా ఉన్న మత్స్యకారులు రక్షించారు. అశోక్ మాత్రం సముద్రంలో గల్లంతైనట్లు ఎస్‌ఐలు తెలిపారు. దుర్గాప్రసాద్‌ను చికిత్స నిమిత్తం తుని ఆస్పత్రికి తరలించారు. అశోక్ నర్సీపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లమో చదువుతున్నాడు. ఎస్‌ఐ పురుషోత్తం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పాయకరావుపేట పోలీసులు, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు బోటు సహాయంతో సాయంత్రం 6 గంటల వరకు అశోక్ కోసం గాలించినా ఆచూకీ లభించలేదు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై

ఉవ్వెత్తున ఉద్యమం

9న నర్సీపట్నం వైద్య కళాశాల భవనాలను సందర్శించనున్న వైఎస్ జగన్

- 7 నియోజకవర్గాల మీదుగా రోడ్ షోగా వెళ్లే అవకాశం
- మాజీ సీఎంను కలవనున్న స్టీల్‌ప్లాంట్, సుగర్ ఫ్యాక్టరీ, బల్క్‌డ్రగ్ పార్క్ బాధితులు
- వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్ సీపీ ఉవ్వెత్తున ఉద్యమిస్తోందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం మద్దిలపాలెంలో గల పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో మెడికల్ కళాశాలను సందర్శించనున్నారని తెలిపారు. ఈ పర్యటన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏడు నియోజకవర్గాల మీదుగా రోడ్ షోగా సాగుతుందన్నారు. వైఎస్ జగన్‌ను స్టీల్ ప్లాంట్, సుగర్ ఫ్యాక్టరీ, బల్క్‌డ్రగ్ పార్క్ బాధితులు కలవనున్నారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం చేస్తున్న ఆలోచనలు తెలిసిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తన మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం స్పష్టంగా వెల్లడిస్తున్నా.. కూటమి పార్టీల ఎంపీలు, మంత్రులకు ఏమీ పట్టనట్లుగా ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్ సీపీ పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడమే కాకుండా ఈ ప్రాంతంలో ఉన్న వనరులను కూటమి నేతలు దోచుకుంటున్నారంటూ మండిపడ్డారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా యూనివర్సిటీలో కనీస మౌలిక వసతులు కల్పించకుండా.. కూటమి నేత సొంత యూనివర్సిటీ కోసం నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ కల్యాణి



పర్యటనపై డీఎస్పీ శ్రీనివాసరావుతో చర్చిస్తున్న అమర్‌నాథ్, గణేష్, తదితరులు

వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మాకవరపాలెం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరిశీలించారు. ఈనెల 9న మండలంలోని భీమబోయిన పాలెం వద్ద గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాల భవనాలను జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పరిశీలకురాలు శోభా హైమావతిలతో కలసి అమర్‌నాథ్, గణేష్ మెడికల్ కళాశాల ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం భద్రత, ఇతర అంశాలపై నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మతో చర్చించారు. కళాశాల భవనాల వద్ద జగన్‌మోహన్‌రెడ్డి మీడియా సమావేశం ఉంటుందని అమర్ డీఎస్పీకి తెలిపారు. పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, నియోజకవర్గంలో వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి

అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

అనకాపల్లి: రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన, నిర్మిస్తున్న 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం అన్యాయమని, వాటిని ప్రభుత్వమే నడపాలని అనకాపల్లి మండల పరిషత్ సమావేశంలో తీర్మానించారు. సోమవారం జరిగిన మండల సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టిన ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టిందని, ఆ సంకల్పానికి ప్రస్తుత ప్రభుత్వం తూట్లు పొడవడం అన్యాయమన్నారు. 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సూరిబాబు

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర కల సాకారం

అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి టౌన్: ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాకారం అవుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో అహర్నిశలు శ్రమిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రజలు సహకరించాలని తెలిపారు. గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో గ్రామస్తుల భాగస్వామ్యం ముఖ్యమని, చెత్తను రోడ్ల మీద, కాలువలో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్తగా విడదీసి అందజేసి వారికి సహకరించాలన్నారు. ప్రజలు తమ ఇంటితోపాటు వారు నివసిస్తున్న వీధిని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలన్నారు. శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడారు. అనంతరం వివిధ రంగాలు, ప్రభుత్వ శాఖలకు చెందిన 45 మందికి స్వచ్ఛాంధ్ర అవార్డులు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆఫీస్ కేటగిరిలో అవార్డు అందుకుంటున్న డీఆర్వో సత్యనారాయణమూర్తి

సారా నిర్మూలనకు 'నవోదయం'

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

నర్సీపట్నం: ఉమ్మడి జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా మార్చడమే ఎక్సైజ్‌శాఖ ముఖ్య ఉద్దేశమని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. సోమవారం ఆయన నర్సీపట్నం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి సాగు, రవాణా కట్టడిపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. పోలీసు, రెవెన్యూశాఖల సమన్వయంతో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. 142 బార్లకు కేవలం 68 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం గంజాయి కేసుల్లో పట్టుబడిన నాలుగు బైక్‌లను వేలం వేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో జీఎస్టీతో కలిపి మొత్తం రూ.15,930 ఆదాయం సమకూరింది.



వాహనాల వేలంను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

డ్వాక్రా రుణాలు గోల్‌మాల్

- వెలుగు, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కై మోసం
- గోవాడ ఎస్‌బీఐ ఎదుట బాధిత డ్వాక్రా సంఘాల సభ్యుల ఆందోళన
- 3 గంటల పాటు బ్యాంక్ విధులకు ఆటంకం
- వెలుగు వీవోఏపై కేసు నమోదు చేసిన పోలీసులు



గోవాడ స్టేట్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత డ్వాక్రా సంఘాలు



ఆందోళన విరమించమని మహిళలను కోరుతున్న పోలీసు సీఐ అప్పలరాజు

చోడవరం: డ్వాక్రా రుణాల గోల్‌మాల్ వ్యవహారంపై గోవాడ ఎస్‌బీఐ ఎదుట బాధిత డ్వాక్రా మహిళలు సోమవారం ఆందోళనకు దిగారు. మరోవైపు పలు డ్వాక్రా సంఘాల పేరున బినామీ రుణాలు తీసుకొని మహిళలను మోసం చేశారంటూ వెలుగు శాఖలో పనిచేస్తున్న సింహాద్రిపురం వీవోఏ వరలక్ష్మిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సింహాద్రిపురం పంచాయతీ పరిధిలో 15 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల నిర్వహణ కోసం వెలుగు శాఖ నుంచి వీవోఏగా వరలక్ష్మి పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సబ్బవరపు కల్లాలకు చెందిన శ్రీరామ డ్వాక్రా సంఘం సభ్యులకు రూ.7.50 లక్షల రుణానికి సంబంధించి అప్పు తీర్చాలంటూ గోవాడ ఎస్‌బీఐ నుంచి మెసేజ్‌లు రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వీవోఏ వరలక్ష్మిని తీసుకుని బ్యాంక్‌కు వెళ్లడంతో అసలు బాగోతం బయటపడింది. గతేడాది ఫిబ్రవరిలో శ్రీరామ డ్వాక్రా సంఘానికి రూ.7.50 లక్షలు, శ్రీసిద్ధి వినాయక డ్వాక్రా సంఘానికి రూ.2 లక్షలు రుణం ఇచ్చినట్టుగా గోవాడ స్టేట్ బ్యాంక్ రికార్డుల్లో ఉంది. అయితే ఆ మొత్తం సంబంధిత డ్వాక్రా గ్రూపు సభ్యుల ఖాతాల్లోకి మాత్రం జమ కాలేదు. మరి ఈ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందని ఆరా తీయడంతో మోసం బయటపడింది.

నిబంధనల ప్రకారం డ్వాక్రా సంఘాలకు బ్యాంక్ రుణం మంజూరు చేసేటప్పుడు సంఘ సభ్యుల సంతకాలు, వారి గ్రూపు ఫొటోతో తమకు బ్యాంక్ రుణం కావాలంటూ దరఖాస్తును వెలుగు వీవోఏ, సీసీ ద్వారా బ్యాంక్‌కు అందజేయాలి. బ్యాంక్ అధికారుల పరిశీలన అనంతరం రుణం మంజూరు చేసి సంఘ సభ్యులను బ్యాంక్‌కు పిలిచి వారితో సంతకాలు చేయించుకొని మంజూరు చేసిన రుణం డబ్బును సదరు డ్వాక్రా సంఘం సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు. అయితే శ్రీరామ డ్వాక్రా సంఘానికి మంజూరైన రుణం మాత్రం అలా జరగలేదు. ఈ సంఘం నుంచి గతంలో రుణం కావాలని బ్యాంక్‌కు దరఖాస్తు చేస్తే అప్పట్లో అధికారులు తిరస్కరించారు. ఆ పత్రాలను వీవోఏ వరలక్ష్మి తన వద్ద ఉంచుకొని సంఘ సభ్యులకు తెలియకుండా బ్యాంక్ రుణం కోసం రెండోసారి దరఖాస్తు చేసింది. బ్యాంక్ అధికారులు కూడా ఆమెతో కుమ్మక్కై రుణం మంజూరు చేశారు. ఈ రుణం డబ్బులను కొత్తగా ఖాతాలు తెరిచి అందులో జమ చేసుకున్నారు. ఆ డబ్బులను బ్యాంక్ అధికారులు, వీవోఏ కలిసి విత్‌డ్రా చేసుకొని పంచుకున్నారంటూ బాధిత శ్రీరామ డ్వాక్రా సంఘం సభ్యులు ఆరోపిస్తూ సోమవారం ఆందోళనకు దిగారు. ఈ వ్యవహారమంతా గతేడాది నవంబరు 12న జరిగింది. అప్పట్లో ఫిర్యాదు చేయగా.. ఎస్‌బీఐ అధికారులు, వెలుగు శాఖల అధికారులు విచారణ చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తమ పేరున ఇంకా బ్యాంక్ రుణం ఇచ్చినట్టుగానే రికార్డుల్లో ఉండడంతో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెన్నెల యోగిత, సబ్బవరపు సంధ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. తమ సంఘాల పేరున బ్యాంక్‌లో రుణం లేనట్టుగా ఎన్‌వోసీ కావాలని పలుమార్లు గోవాడ ఎస్‌బీఐ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని సభ్యులు మండిపడ్డారు. మరోసారి బ్యాంక్ ముందు బైఠాయించి తలుపులు మూసివేశారు. డ్వాక్రా మహిళల ఆందోళనతో బ్యాంక్ లావాదేవీలకు సుమారు 3 గంటల పాటు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని బ్యాంక్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చోడవరం సీఐ అప్పలరాజు సిబ్బంది వచ్చి పరిస్థితిని సమీక్షించారు. బాధిత మహిళలతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. ఈ గోల్‌మాల్‌లో కీలకపాత్ర పోషించిన వెలుగు వీవోఏ వరలక్ష్మిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మోసం సుమారు రూ.20 లక్షలు

సబ్బవరపువారి కల్లాలకు చెందిన డ్వాక్రా మహిళలంతా వ్యవసాయం, కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరికి బ్యాంక్‌కు వెళ్లే సమయం లేకపోవడంతో ప్రతి నెలా వాయిదా డబ్బులు వెలుగు వీవోఏ వరలక్ష్మికి ఇచ్చేవారు. ఆమె కొంత కాలంగా బ్యాంక్‌కు కట్టకుండా రూ.20 లక్షలు కాజేసిందని వారు ఆరోపించారు.

మహిళ హత్య కేసులో ముద్దాయికి జీవితఖైదు

చోడవరం: మహిళ హత్యకేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఈ కేసులో నిందితుడైన అనంతగిరి మండలం కాశీపట్నం గ్రామానికి చెందిన కంట సూరిబాబుకు యావజ్జీవ కారాగారశిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో 2 నెలలు సాధారణ జైలు శిక్ష విధించాల్సి ఉంటుందని కోర్టు తీర్పు చెప్పింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం గ్రామానికి చెందిన కంట సూరిబాబు (41) అదే గ్రామానికి చెందిన కొర్లాపు లక్ష్మి ఇంట్లోకి వెళ్లి లైంగికంగా వేధించాడు. అతని కోరిక తీర్చేందుకు ఆమె నిరాకరించడంతో కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని ఎస్.కోట ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షి శరగం రాజారావు దీనిపై 2017 ఏప్రిల్ 3వ తేదీన అనంతగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును అప్పటి సీఐలు సింహాద్రినాయుడు, వెంకునాయుడు దర్యాప్తు చేశారు. ఈ కేసుపై చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టులో వాదనలు జరిగాయి. ఏపీపీ యు.వెంకట్రావు వాదనలు వినిపించగా సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి హరినారాయణ తీర్పు చెప్పినట్టు అరకు సీఐ హిమగిరి తెలిపారు.



స్వచ్ఛ పురస్కారాలు | స్వచ్ఛ ఆఫీస్, స్వచ్ఛ ఆస్పత్రి కేటగిరిలో కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి అవార్డులు అందుకుంటున్న అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు, ఎన్టీఆర్ ఆస్పత్రి డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆయుష్ విభాగం జిల్లా అధికారి డాక్టర్ లావణ్య, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ -అనకాపల్లి టౌన్

క్షేత్రస్థాయి విచారణతో అర్జీలకు పరిష్కారం

- కలెక్టర్ విజయ కృష్ణన్
- పీజీఆర్ఎస్‌లో 188 అర్జీలు నమోదు

తుమ్మపాల: పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని, అర్జీదారునితో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ఆమెతోపాటు జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై విచారణ వేగంగా చేయాలన్నారు. సమస్యలపై క్షుణ్ణంగా విచారించి పరిష్కారంపై అర్జీదారునికి వివరించాలన్నారు. అర్జీదారునికి ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారి వాట్సాప్‌కు నేరుగా పంపించాలన్నారు. ఈ వారం పీజీఆర్ఎస్‌లో 188 అర్జీలు నమోదయ్యాయి.

కుంచంగి రోడ్డు అభివృద్ధిపై కూటమి హామీ నెరవేర్చాలి

కూటమి ప్రభుత్వం హామీ మేరకు ఏడాదిలో అభివృద్ధి చేస్తామన్న కుంచంగి రోడ్డుకు తక్షణమే నిధులు మంజూరు చేయాలంటూ అనకాపల్లి మండలం కుంచంగి గ్రామస్తులు కలెక్టరేట్‌లో అర్జీ చేశారు. గ్రామంలో మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి వచ్చే డీఎంఎఫ్ నిధులు వెచ్చించి గ్రామానికి రోడ్డు అభివృద్ధి చేయాలని, ఏళ్ల నాటి నుంచి భారీ గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డును కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అయినా ప్రారంభించలేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో మూడు సార్లు వినతులు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

వుడా ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అడ్డంకులు

ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వుడా ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయకుండా తీవ్ర అడ్డంకులు సృష్టిస్తున్నారని, భూములిచ్చిన 27 మంది రైతులకు న్యాయం చేయకుంటే ఆందోళనలు చేపడతామంటూ అనకాపల్లి మండలం కుంచంగి గ్రామస్తులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. భూములు తీసుకుని పట్టణ ప్రజలకు ఇళ్లు నిర్మిస్తున్నారని, తమకు మాత్రం న్యాయం చేయడం లేదని వాపోయారు. ఈ అంశమై కలెక్టరమ్మ విచారణ చేసి తమకు ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో 52 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు సోమవారం 52 అర్జీలు వచ్చాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూ సమ్యలు, కుటుంబ కలహాలుపై ఎక్కువగా అర్జీలు వచ్చాయన్నారు. భూ సమస్యలపై-32, కుటుంబ కలహాలు-5, మోసాలకు సంబంధించినవి-3, ఇతర విభాగాలివి-12 అర్జీలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐలు మల్లేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఏకగ్రీవ సర్పంచ్‌లకు ప్రోత్సాహకాలేవీ?



కలెక్టర్ ఆఫీస్ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవ సర్పంచ్‌లుగా ఎన్నుకోబడ్డ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు మంజూరు చేయాలని కోరుతూ చీడికాడ మండలం జేబీపురం, దండిసురవరం, శిరిజాం, పెదగోగాడ, అడవి అగ్రహారం గ్రామాల సర్పంచ్‌లు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తాము సర్పంచ్‌లుగా ఎన్నికై నాలుగేళ్ల 6 నెలలు పూర్తయినా ఇంతవరకూ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని వాపోయారు. తక్షణమే నిధులు మంజూరు చేయాలంటూ కలెక్టర్‌ను ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొల్లవిల్లి చినమ్మలు, కోన అర్జున, కె.సత్యవతి, పి.అచ్చియమ్మ, సలాది లక్ష్మి కోరారు.

‘చౌడువాడ’కు రెండు రాష్ట్ర స్థాయి పురస్కారాలు



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు స్వీకరిస్తున్న చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు



సీఎం నుంచి పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ ఎరుకునాయుడు, కార్యదర్శి సురేష్‌బాబు

కె.కోటపాడు: ‘చౌడువాడ’ను రాష్ట్ర స్థాయిలో రెండు స్వచ్ఛాంధ్ర అవార్డులు రెండు వరించాయి. స్వచ్ఛ గ్రామ పంచాయతీగా చౌడువాడ ఎంపిక కావడంతో విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌బాబు పురస్కారం అందుకున్నారు. స్వచ్ఛ హాస్పటల్ విభాగంలో చౌడువాడ పీహెచ్‌సీ అవార్డుకు ఎంపికయింది. ఇదే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వైద్యాధికారి మాదంనాయుడు, ఎంపీహెచ్ఈవో జె.సన్యాసిరావు అవార్డును స్వీకరించారు.

విజయనగరం విజయదుందుభి

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాల, బాలికల జట్లకు ప్రథమ స్థానం



విజేతగా నిలిచిన విజయనగరం జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లు

గొలుగొండ: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం విజయదుందుభి మోగించింది. అండర్-14 బాల, బాలికల విభాగాల్లో హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌ల్లో ఈ జిల్లా జట్లు ప్రథమ స్థానం సాధించాయి. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామ హైస్కూల్లో ఈ నెల 4న ప్రారంభమైన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్లో పోటీల్లో విజయనగరం, గుంటూరు బాలురు జట్లు తలపడ్డాయి. ఇందులో 2 పాయింట్ల తేడాతో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ స్థానానికి పరిమితమైంది. అనంతరం బాలికల పోరులో విజయనగరం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఈ పోటీలో విజయనగరం బాలికలదే పై చేయి అయింది. ఒక పాయింటు తేడాతో విజేతగా నిలిచింది. చిత్తూరు జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లుకు నర్సీపట్నం టౌన్ సీఐ గోవిందరావు, కృష్ణదేవిపేట పూర్వపు ఎస్ఐ తారకేశ్వర్రావు, సాఫ్ట్‌బాల్ నిర్వహణ ప్రతినిధులు రమణ, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, సూర్య దేముడు, సతీష్, భవానీ, చంద్రమోహన్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎస్.రాయవరం: మండలంలో రేవుపోలవరం బీచ్‌లో సోమవారం రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికలు సందడిగా జరిగాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 54 జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. అండర్ -14, 17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈ నెల 19, 20, 21 తేదీల్లో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు ఆడతారని కొరుప్రోలు ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.ప్రసాద్ తెలిపారు. ఈ ఎంపికలు కొరుప్రోలు పీడీ అమ్మోరయ్య ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించామన్నారు.

అండర్ -17 విభాగంలో

అచ్యుతాపురం జెడ్పీహెచ్ నుంచి బడితబోయిన విజయ్, దార్లపూడి నుంచి షేక్ నౌషాద్, దిమిలి యోగి, రేవుపోలవరం నుంచి చెల్లూరి మణికంఠ, బాలికల విభాగంలో విశాఖపట్నం కైట్స్ కళాశాల నుంచి వమ్మి చరిష్మ, పెదగుమ్ములూరు నుంచి పోలిశెట్టి పావని, బొజ్జా అలేఖ్య, జొన్నవరం నుంచి నిట్ట చంద్రకళ ఎంపికయ్యారు.

అండర్ -14 విభాగంలో

బాలుర విభాగంలో గుడివాడ నుంచి దారబోయిన సుశాంత్, దేవర సుధీర్, లంకెలపాలెం నుంచి గుమ్మిడి కిషోర్, గుంటపల్లి నుంచి గొట్ల అక్మిత్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో అచ్యుతాపురం నుంచి బురిడి పవిత్ర, శేశెట్టి జోషిక, గుంటపల్లి నుంచి దర్శికాపు రాణి, దుంగా బాలశ్రీ ఎంపికయ్యారు.

అనకాపల్లి నుంచి ప్రత్యేక రైళ్లు

అనకాపల్లి: దీపావళి పండగను పురస్కరించుకుని అక్టోబర్‌లో అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి మూడు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ సత్యనివాస్ చెప్పారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి రైలు బయలుదేరి మంగళవారం ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. మంగళవారం అనకాపల్లి స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.35 గంటలకు, శుక్రవారం అనకాపల్లి స్టేషన్ నుంచి కాచిగూడ స్టేషన్‌కు సాయంత్రం 5.35 గంటలకు రైళ్లు బయలుదేరుతాయన్నారు. తిరుపతికి ప్రతి సోమవారం, సికింద్రాబాద్‌కు ప్రతి మంగళవారం, కాచిగూడకు ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెలాఖరు వరకు నడుస్తాయన్నారు.

బడుగులపై పిడుగుపాటు

జిల్లాలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతోపాటు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. వీటి ధాటికి కె.కోటపాడు మండలంలో రైతు దుర్మరణం చెందగా, నక్కపల్లి మండలంలో రెండు గేదెలు, యలమంచిలి మండలంలో ఒక గేదె మరణించాయి.

- కె.కోటపాడు మండలంలో రైతు దుర్మరణం
- రాజయ్యపేట, తెరువుపల్లిలో మూడు గేదెలు మృతి



మృతి చెందిన జగన్నాథం

కె.కోటపాడు: మండలంలో పొడుగుపాలెం గ్రామానికి చెందిన రైతు లెక్కల జగన్నాథం(52) ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతోపాటు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ మృతిపై ఎ.కోడూరు పోలీసులకు మృతుడు భార్య లక్ష్మి సోమవారం ఫిర్యాదు చేసింది. పొలంలో ఉన్న సమయంలో పిడుగు పడడంతో అతడు మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహానికి అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు.



మృతి చెందిన గేదెలు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేటలో ఆదివారం రాత్రి పిడుగు పడి రెండు గేదెలు మరణించాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఇదే సమయంలో పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు రెండు గేదెలు అక్కడికక్కడే మరణించాయని బాధితుడు గ్రామ మత్స్యకారుడు మైలపల్లి బైరాగి వాపోయాడు. రెండు పాడి గేదెలను ఇటీవలే రూ.1.50 లక్షలకు కొనుగోలు చేశానని, అవి మృత్యువాత పడటంతో తీవ్రంగా నష్టపోయానంటూ కన్నీటి పర్యంతమవుతున్నాడు.

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. యలమంచిలిలో పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో రైతు తుమ్మపాల పైడికొండ తన గేదెను పశువుల పాకలో కట్టి ఉంచాడు. రాత్రి పిడుగు పడడంతో పశువుల పాక కాలిబూడిదైంది. పాకలో గేదె మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున పాక వద్ద గేదె కళేబరాన్ని చూసిన కన్నీటిపర్యంతమయ్యాడు. తనకు జీవనాధారమైన పశువు ప్రకృతి విపత్తుతో కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. తెరువుపల్లి వార్డు కౌన్సిలర్ చిన్న శ్రీను, గ్రామ పెద్దలు రైతును ఓదార్చారు. పశుబీమా పరిహారం మంజూరయ్యేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



పిడుగుపాటుకు మృతి చెందిన గేదె

ఎంటెక్ రెగ్యులర్, ఈవెనింగ్ కోర్సులకు ప్రవేశాలు

మద్దిలపాలెం: ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ రెగ్యులర్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీఏ నాయుడు సోమవారం తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 15 వరకు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుతోపాటు రూ.2 వేలు డీడీ అందించాలని పేర్కొన్నారు. 17న ఉదయం 10 నుంచి బ్రాంచ్‌ల వారీగా ఆయా బ్రాంచ్‌లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు www.audoa.andhrauniversity. eduinను సందర్శించాలని సూచించారు.

- ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో అందించే వివిధ ఎంటెక్ సాయంత్రం కోర్సులకు కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఏ నాయుడు తెలిపారు. 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు, ఇన్ఫర్మేషన్ బ్రోచర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

13న కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టు కార్మికుల ధర్నా

అనకాపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న కలెక్టర్, ఆర్డీవో, జిల్లా ఆస్పతుల వద్ద ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యల పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లోనూ, మెడికల్ కళాశాలల్లోనూ, డిస్పెన్సరీలోనూ పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు యూనియన్ పోరాట ఫలితంగా జీవో నంబరు 138 వచ్చిందన్నారు.

రాజపుత్ర సమాజ్ అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

అచ్యుతాపురం: అనకాపల్లి జిల్లాలోని క్షత్రియులంతా రాజపుత్ర సమాజ్ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా రాజపుత్ర సమాజ్ నూతన అధ్యక్షుడు దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్, కార్యదర్శిగా రాంబిల్లికి చెందిన కిశోర్‌కుమార్ రాజు, ఉపాధ్యక్షులుగా చేకూరి శ్రీనివాసరాజు, పిన్నమరాజు వాసు, కోశాధికారిగా మంతెన లీలావతి నియమితులయ్యారు.

రేపటి నుంచి తపాలా శాఖ ఆధార్ క్యాంపులు


యలమంచిలి రూరల్: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో ఆధార్ నమోదు, నవీకరణ చేపడతామన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో నర్సీపట్నం కృష్ణాబజార్, పాయకరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఈ నెల 10, 11 తేదీల్లో యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, నర్సీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల, ఈ నెల 13,14 తేదీల్లో మాకవరపాలెం ఎంపీపీ స్కూల్, కశింకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో క్యాంపులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ ఉచితంగా చేస్తామన్నారు. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు 7 నుంచి 15 సంవత్సరాల వయసున్న పిల్లలకు చేసే తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ నుంచి కూడా ఏడాది కాలం వరకు రుసుము నుంచి మినహాయింపునిచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళ్యాణపులోవలో 200 క్యూసెక్కుల విడుదల

రావికమతం: కళ్యాణపులోవ జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జలాశయం ఏఈ సూర్య సోమవారం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 458.6 అడుగులకు చేరిందని పేర్కొన్నారు. కురుసున్న వర్షాలకు 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని ఆయన తెలిపారు.

వడివడిగా పోర్టు అడుగులు

- వైజాగ్ పోర్టు ఏర్పడి నేటికి 92 ఏళ్లు
- మేజర్ పోర్టులతో పోటీపడుతూ అభివృద్ధి పనులు
- కవర్డ్ స్టోరేజ్ యార్డులు నిర్మాణం, బెర్త్‌ల పునరుద్ధరణ పనులు
- అందుబాటులోకి మోడ్రన్ పోర్ట్ ఆపరేటింగ్ సిస్టమ్



సాక్షి, విశాఖపట్నం : ఈస్ట్‌కోస్ట్ గేట్ వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ నేటితో 92 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఏటికేడూ ప్రగతి పథంలో పయనిస్తూ.. నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతూ సరికొత్త వ్యూహాల్ని అనుసరిస్తోంది. పెట్టుబడుల ప్రవాహం.. పెరుగుతున్న సామర్థ్యానికి అనుగుణంగా విస్తరణ పనులతో పోర్టు వచ్చే ఆవిర్భావ దినోత్సవానికి సరికొత్త సొబగులద్దుకోనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీల విస్తరణ, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతుండటంతో.. విశాఖ పోర్టు ప్రపంచ వాణిజ్య కేంద్రానికి చిరునామాగా మారనుంది. ఈ ఏడాది స్వచ్ఛతా అవార్డుల్లో దేశంలో ప్రథమ స్థానం సాధించింది.

తొలి పాసింజర్ షిప్ జలదుర్గతో..

1927లో విశాఖపట్నం పోర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1933 అక్టోబర్ 7న పోర్టు నుంచి సరకు రవాణాని ప్రారంభించింది. సింధియా స్టీమ్ నేవిగేషన్ కంపెనీ తొలి పాసింజర్ షిప్ జలదుర్గని విశాఖ పోర్టుకు తీసుకొచ్చింది. అప్పటి వైస్రాయ్, గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా లార్డ్ విల్లింగ్ డన్ నౌకాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విశాఖపట్నం హార్బర్‌ను సుందరంగా తీర్చిదిద్దడంలో ఇంజనీర్లు డబ్ల్యూసీ యాష్, ఓబీ రాటెన్‌బరీలు ముఖ్య భూమిక పోషించారు. పోర్టుకు సమీపంలోనే స్టీల్‌ప్లాంట్, సెయిల్, ఎన్టీపీసీ, నాల్కో, ఎన్ఎండీసీ, హిందుస్థాన్ షిప్‌యార్డు, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, హెచ్‌పీసీఎల్ వంటి భారీ పరిశ్రమలున్నాయి. పోర్టులో ప్రధానంగా స్టీల్, పవర్, మైనింగ్, పెట్రోలియం, ఎరువులు తదితర సరుకుల్ని నిర్వహిస్తోంది. దేశంలోనే అత్యంత లోతైన కంటైనర్ టెర్మినల్ పోర్టులోనే ఉండటం విశేషం.

సరికొత్త సంస్కరణలు

గ్రీన్ పోర్టుగా తీర్చిదిద్దేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే 10 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్‌ని ఏర్పాటు చేసి.. పోర్టుకు అవసరమైన విద్యుత్‌మొత్తాన్ని సొంతంగా ఉత్పత్తి చేసుకుంటోంది. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా మరో 190 కిలోవాట్ల విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తోంది. 2055-26 నాటికి 30 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు.

- ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.150 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు ప్రారంభించింది. త్వరలోనే పనులు పూర్తి కానున్నాయి.
- 845 మీటర్ల పొడవు, 16 మీటర్ల సహజ సిద్ధమైన లోతును కలిగి విశాఖ కంటైనర్ టెర్మినల్ కంటైనర్ ట్రాఫిక్ కు ముఖ ద్వారంలా ఉంది. ఏపీ, తెలంగాణా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర జార్ఖండ్, మధ్యప్రదేశ్ , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు విశాఖ కంటైనర్ టెర్మినల్ గేట్‌వేగా వ్యవహరిస్తోంది.
- మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను 666 వాహనాల పార్కింగ్ సామర్థ్యంతో నిర్మించింది. 84,000 టన్నుల సరుకును నిల్వ ఉంచే విధంగా కవర్డ్ స్టోరేజ్ షెడ్ నిర్మాణాలు, యార్డు నిర్మాణం పూర్తి చేసింది.
- పోర్టులోని కార్యకలాపాల్ని యాంత్రీకరించే ప్రక్రియ జోరందుకుంది. రూ.655 కోట్లతో ఈక్యూ-7, వెస్ట్ క్యూ-7, 8 బెర్త్ లను యాంత్రీకరించే పనులు పీపీపీ పద్ధతిలో చేపడుతున్నారు.
- రూ.800 కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, సీఎన్జీ బంకరింగ్ స్టేషన్ నెలకొల్పేందుకు హెచ్‌పీసీఎల్, ఐఓసీతో ఎంవోయూ కుదుర్చుకుంది.
- రూ.276 కోట్లతో ఆయిల్ రిఫైనరీ బెర్త్-2 నిర్మాణం, అడ్వాన్స్‌డ్ ఫైర్‌ఫైటింగ్ ఫెసిలిటీ, ఆర్ఎఫ్ఐడీ గేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మోడ్రన్ పోర్టు ఆపరేటింగ్ సిస్టమ్‌ని ప్రారంభించారు.
- ఇటీవలే ఏడు దేశాలకు ఆతిథ్యమిస్తూ బిమ్స్‌టెక్-2025 కాంక్లేవ్‌ని విజయవంతంగా వీపీఏ నిర్వహించింది.

స్కూల్ గేమ్స్‌లో కశింకోట విద్యార్థుల ప్రతిభ

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ జూడో, కుస్తీ పోటీల్లో ఐదు స్వర్ణ పతకాలను, నాలుగు రజత పతకాలను సాధించారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం హైస్కూల్లో ఈ పోటీలు జరిగాయి.



రాష్ట్ర స్థాయి జూడో, కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

క్లుప్తంగా

కశింకోటలో అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

కశింకోట: స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గౌరమ్మ ఊరేగింపు

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో గౌరీ పరమేశ్వరుల (గౌరమ్మ) విగ్రహాన్ని సోమవారం నెలకొల్పారు. ఈ సందర్భంగా పొలం నుంచి వరి దుబ్బు సంప్రదాయంగా ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో ప్రతిష్టించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, తీడ నరసింగబిల్లి గ్రామాల్లో అనారోగ్యానికి గురైన నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. రెండు లక్షల చెక్కులను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సోమవారం అందజేశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కూటమి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

9న జీఎస్టీపై వైద్యశాఖ సమావేశం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌దేవ్

అనకాపల్లి: వైద్య శాఖలో జీఎస్టీపై ఈ నెల 9న అనకాపల్లి డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఐవో జిల్లా అధికారి చంద్రశేఖర్ దేవ్ తెలిపారు. సోమవారం స్థానిక డీఎంహెచ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య శాఖలో వివిధ రకాల పరికరాలపై 12 శాతం నుంచి 5 శాతం జీఎస్టీని తగ్గించారన్నారు. రోగులు వైద్య పరికరాలు కొనుగోలు చేసే సమయంలో గతంలో ఉన్న రేట్లుకు ప్రస్తుత రేట్లుకు తేడాను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎల్.రామకృష్ణ, మిన్నరాజు, శేషుకుమార్, జగదీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీయాంక్ ఫార్మాకు స్వచ్ఛాంధ్ర పురస్కారం



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీయాంక్ ఫార్మా అధినేత సుబ్బారావు

పరవాడ: విశాఖ ఫార్మాసిటీలోని సీయాంక్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ స్వచ్ఛ ఇండస్ట్రీస్ కేటగిరీలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డును పొందింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ అధినేత జె.సుబ్బారావు అందుకున్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 215 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,220	5,090
రెండో రకం	3,850	4,390
మూడోరకం	3,780	3,830

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఇడ్లీ కొట్టు
సత్యనారాయణ స్క్రీన్-1	:కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: కాంతార
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 118 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-25, బీ పాజిటివ్-36, ఓ పాజిటివ్-47, ఏబీ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

పడకేసిన పల్లె వైద్యం



ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు

- సమ్మెలో పీహెచ్‌సీల వైద్యులు
- వారం రోజులుగా సక్రమంగా అందని సేవలు
- అత్యవసరమైతే ఎన్టీఆర్ ఆస్పత్రికి సిఫార్సు

అనకాపల్లి టౌన్: రోగి నాడి పట్టి వైద్యం అందించే గ్రామీణ వైద్యులకు కష్టకాలం వచ్చింది. ప్రజల కోసం అనునిత్యం గ్రామీణ ఆస్పత్రుల్లో పనిచేసి ప్రజల బాగోగుల కోసం పరితపించే వైద్యులు తమ సమస్యలు పరిష్కారం కోసం నిరసన గళం వినిపిస్తున్నారు. కూటమి సర్కార్ అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ప్రత్యక్ష యుద్ధానికి దిగారు. గత వారం రోజుల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యమం చేస్తున్నారు.

మండలంలోని తుమ్మపాల, తగరంపూడి గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో పని చేస్తున్న డాక్టర్లు సమ్మె బాట పట్టడంతో ఆయా సమీప గ్రామ ప్రజలకు అరకొరగా వైద్య సేవలందుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎక్కువగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామ ప్రజలకు అలవాటైన డాక్టర్లు లేకపోయేసరికి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పేదల చేతి చమురు వదులుతుంది. మరికొంత మంది సుదూరంలో ఉన్న ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్తున్నారు. తగరంపూడి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే సేవలందిస్తున్నారు. దీంతో సమీప గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తుమ్మపాల పీహెచ్‌సీలో ఒక్క డాక్టర్ వైద్య సేవలందిస్తుండగా, సమ్మెకు ముందు రోజుతో ఓపీ పోల్చుకుంటే తగ్గుతూ వస్తుంది.

సాధారణ వైద్య సేవలే..

పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సాధారణ వైద్య సేవలే అందిస్తున్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్న వారికి మందులు ఇచ్చి పంపించేస్తున్నారు. దాంతో గతంలో కంటే రోగుల తాకిడి తగ్గింది. రెగ్యులర్ వైద్యులు సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన వైద్యులు రోగం తీవ్రత బట్టీ ఎన్టీఆర్ ఆస్పత్రికి సిఫార్స్ చేస్తున్నారు.



బోసిపోయిన పీహెచ్‌సీ

డాక్టర్ల ప్రధాన డిమాండ్లు ఇవే..

- ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించడం.
- టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయడం.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు.
- నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు చేయాలి
- చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేల అలవెన్స్ ఇవ్వాలి.
- నేటివిటి అండ్ అర్బన్ ఇలిజిబిలిటీ సమస్యల పరిష్కారం
- పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలి.
- వైద్యుల జాబ్ చార్ట్ ఇవ్వాలి.
- అనధికార వ్యక్తులు మెడికల్ శాఖకు సంబంధం లేని వారు పీహెచ్‌సీలను తనిఖీలు చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి
- తగినంత స్టాఫ్ నర్సులు లేక పోయినా పీహెచ్‌సీలను డాక్టర్లు నడిపిస్తున్న కఠిన పరిస్థితులను పరిగణంలోకి తీసుకోవాలి.

ఆధార్ లేకపోయినా వైద్యం చేయాలి



వైద్యం చేయించుకోవడానికి వస్తుంటే, ఓపీ వద్ద ఆధార్ కార్డు అడుగుతున్నారు. దీనివల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఆధార్ లేకపోయినా వైద్య సేవలందించాలి. – కె. నాగరాజు, తుమ్మపాల

అరకొరగానే వైద్య సేవలు



అరకొరగానే వైద్య సేవలందుతున్నాయి. పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు పెంచాలి. ఒక్క డాక్టర్ మాత్రమే సేవలందిస్తున్నారు.

– వై శ్రీను, తుమ్మపాల

రోగులకు ఇబ్బంది లేదు

డాక్టర్లు సమ్మెలో ఉన్నా వైద్య సేవలకు ఆటంకం లేదు. రోగులకు ప్రాథమికంగా వైద్య సేవలందిస్తున్నాం. క్రిటికల్ సమస్యలైతే ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నాం.

– డాక్టర్ సుధాకర్, పీహెచ్‌సీ వైద్యుడు, తుమ్మపాల

నీట మునిగిన రోడ్డు

రాకపోకలకు ఇబ్బందులు

కశింకోట: స్థానిక జాతీయ రహదారి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు వెళ్లే రోడ్డులో వర్షం చేరడం వల్ల ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే నీట మునిగి ఉన్న రోడ్డు ఆదివారం రాత్రి వర్షం కురవడంతో మరింతగా నీరు వచ్చి చేరింది. దీంతో సోమవారం ఆ మార్గంలో రాకపోకలు సాగించడానికి అవాంతరం ఏర్పడింది. ఈ రోడ్డులో ప్రధానంగా ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమగ్ర బాలికల వసతి గృహం, అఫీషియల్ కాలనీలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం వర్షం పడిన ఈ రోడ్డు మునిగి ఉంటోంది. రోడ్డు పల్లంగా ఉండడం, పక్కన ఉన్న కాలువ నుంచి నీరు పోయే మార్గం సవ్యంగా లేకపోవడం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దసరా సెలవులు అనంతరం వసతి గృహానికి తమ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు స్థానికులు, అధికారులు, పీహెచ్‌సీకి వెళ్లే రోగులు రోడ్డుపై నిల్వ నీటిలో నుంచి రాకపోకలు సాధించడానికి తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ఇప్పటికైనా అధికారులు రోడ్డును ఎత్తు చేసి, నీరు నిల్వ ఉండకుండా పక్కనున్న కాలువను సరి చేయడానికి, తమ ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పీహెచ్‌సీ వైపు రోడ్లో నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

'మరిడిమాంబ ఆలయ స్థలాన్ని కాపాడండి'

సబ్బవరం: మండలంలోని గొటివాడ గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ స్థలాన్ని అక్రమించే క్రమంలో వివాదానికి దిగుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్మాణ స్థల దాతలు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ చిన్నికృష్ణకు ఆయన కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాలు.. మరిడిమాంబ ఆలయానికి గొటివాడ రెవెన్యూ పరిధి సర్వే నెం.275-1లో 30 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన చింతలపాటి సత్యనారాయణరాజు దానమిచ్చారు. సత్యనారాయణరాజు చిన్నాన్న చింతలపాటి తమ్మిరాజుకు వారసులు లేకపోవడంతో ఆయన నుంచి వారసత్వంగా దఖలుపడింది. సత్యనారాయణరాజు తదనంతరం ఆయన భార్య వరహాలమ్మ పేరిట రికార్డుల్లో ఖాతా నెం.625తో నమోదయింది. సదరు భూమిని గ్రామస్తుల సమక్షంలో గ్రామ దేవతకు సత్యనారాయణరాజు ఇచ్చాపూర్వకంగా అందించారు. దాదాపు 2 దశాబ్దాలకు పైగా ఆ స్థలాన్ని అమ్మవారి దేవాలయ అవసరాలకు వినియోగిస్తున్నారు.

అయితే అదే గ్రామానికి చెంది, గతంలో జిల్లా సర్వేయర్‌గా పనిచేసిన దువ్వూరి సుబ్బారావు ఆ స్థలాన్ని అక్రమించేందుకు రికార్డులను తారుమారు చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీన్ని ఆధారంగా చేసుకుని సుబ్బారావు సోదరుడు అచ్చుతం భార్య దువ్వూరి లలిత స్థలంపై వివాదం రేపుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా, సాంఘికంగా బలమైనవారు కావడంతో గ్రామస్తులను, ఆలయ కమిటీ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని భూమిని గ్రామ దేవత ఆలయానికి కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బి.సత్యారావు, ఎస్.సూరిబాబు, విరోతి చినఅప్పలనాయుడు, కె.పరమేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, విరోతి రామారావు, జి.గణేష్, ఇ.సింహాచలం, ఎస్‌వీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు

గుంతల రోడ్డుతో ప్రజల ఇబ్బందులు

పరవాడ: యలమంచిలి-గాజువాక రహదారిలో పలు చోట్ల ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలతో రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందుల్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా సినిమాహాలు కూడలి, సబ్‌స్టేషన్ కూడలి, ఊటగెడ్డ కూడలి, మండల కాంప్లెక్స్ కూడళ్లలో ఏర్పడిన భారీ గుంతల కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, వివిధ కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ముందే ఇరుకు రోడ్డు, ఆపై భారీ గుంతలు, అంతంతమాత్రంగా వెలుగుతున్న వీధి దీపాలతో చీకటి పడితే రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పునరుద్ధరణ చర్యలు చేపట్టకపోయినా.. కనీసం మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.



సినిమాహాలు కూడలిలో ఏర్పడిన భారీ గుంతలు

మరమ్మతులతో ఆర్వో ప్లాంట్.. తాగునీటికి ఇక్కట్లు

పరవాడ: మండలంలో ముత్యాలమ్మపాలెం గంగపుత్రుల సౌకర్యార్థం సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం కిలో మీటర్ల మేర పక్క గ్రామాలకు పరుగు తీయాల్సి వస్తోంది. 2016లో గంగపుత్రుల కోసం సీఎస్సార్ నిధులు రూ.12 లక్షలు వెచ్చించి దీన్ని ఎన్టీపీసీ ఏర్పాటు చేసింది. కొంత కాలం సక్రమంగా పనిచేసిన ప్లాంట్‌కు మరమ్మతులు రావడంతో మూలకు చేరింది. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో బోర్ల నుంచి వచ్చే నీరు తాగేందుకు పనికిరాకపోవడంతో ఆర్వో ప్లాంట్ నీటితో దాహం తీర్చుకునే వారు. ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ మూతపడడంతో 3 కి.మీ. దూరంలోని వాడచీపురుపల్లి, దీపాంజలినగర్ ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోందని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం ప్రజలు వాపోతున్నారు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకురావాలని నీటి సరఫరా విభాగం అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.



ముత్యాలమ్మపాలెంలో రిపేర్లతో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

పార్టీ శ్రేణులతో సమావేశం నేడు

అనకాపల్లి: పట్టణంలోని రింగ్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కశింకోట, అనకాపల్లి మండలాల అధ్యక్షులు మలసాల కిషోర్, పెదిశెట్టి గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9న నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో మెడికల్ కళాశాల వద్ద ధర్నాకు రానున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనపై నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ చర్చిస్తారన్నారు. కశింకోట మండలం ఏఎస్ పేటలో ఉదయం తన స్వగృహంలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకునికి పరామర్శ

అనకాపల్లి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ వింగ్ అధ్యక్షుడు గైపూర్ రాజును ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ నెల 4న కశింకోట జాతీయ రహదారిలో కనకదుర్గమ్మను దర్శించుకుని మెట్ల మార్గంలో జారిపడిపోవడంతో కుడి చేయికి దెబ్బ తగిలింది. వెంటనే రాజును అక్కడ భక్తుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా, సత్యదేవ్ ఆస్పత్రి అధినేత బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు మున్నూరు శ్రీనివాసరావు, శ్రీధరాల మనోజ్, పెంటకోట శ్రీను, కాంద్రేగుల శ్యామ్, మళ్ల చందు తదితరులు పాల్గొన్నారు.



గైపూర్ రాజు ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న భరత్‌కుమార్, పార్టీ నాయకులు

గైపూర్ రాజుకు రూ.20 వేల సాయం

ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గైపూర్ రాజుకు సంఘ సేవకుడు, ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు సోమవారం రూ.20 వేల సాయం చేశారు.

గ్రామాల అభివృద్ధికి నిధులేవీ?

- 15 ఫైనాన్స్ నిధులతోనే పనులు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి: మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఏడాదిన్నర నుంచి నిధుల మంజూరు చేయడంలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15 ఫైనాన్స్ నిధులతోనే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. పట్టణంలో మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జలజీవన్ మిషన్ నత్తనడకన సాగుతుందన్నారు. మండలంలోని 32 పంచాయతీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామ సభల సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, పరిష్కార మార్గానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే ప్రాంతాల్లో సర్వేయర్లు భూ యజమానులకు కనీస సమాచారం అందజేయడం లేదన్నారు. మండలంలో కొత్తగా 8 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను చూపించడం లేదన్నారు. కొంత మంది వ్యక్తులు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలని, ప్రజలు వ్యాధులు బారిన పడకుండా వైద్య సిబ్బంది దృష్టి సారించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ స్థలం ఇచ్చి, పూర్తి హక్కులు కల్పించాలన్నారు. కొన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారని ఆరోపించారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీతోపాటు ఎంపీడీవో ఆశాజ్యోతి, ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిభూషణరావు మాట్లాడుతూ దశలు వారీగా గ్రామాల్లో పర్యటించి, అక్కడ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. జలజీవన్ మిషనల్ ద్వారా పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అయితా రాము, విల్లూరి సూర్యకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాలరావు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



సమావేశానికి హాజరైన గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వశాఖ అధికారులు

తగరంపూడి అభివృద్ధికి రూ.కోటి ఖర్చు చేయాలి



తగరంపూడి గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేంద్ర గుర్తింపు రావడమే కాకుండా అవార్డును తీసుకున్నాను. కేంద్ర ప్రభుత్వం ఏడాది క్రితం గ్రామ అభివృద్ధికి రూ.కోటి ఇచ్చింది. ఏడాది నుంచి ఈ నిధులు బ్యాంక్‌లో నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఈ నిధులు ఎందుకు ఖర్చు చేయలేదో అర్థం కావడంలేదు. ఈ నిధులపై ఎంపీడీవో దృష్టి పెట్టాలి.

– అప్పారావు, సర్పంచ్, తగరంపూడి గ్రామం

తుమ్మపాలలో పాస్ బుక్‌లు నేటికీ ఇవ్వలేదు



తుమ్మపాల రెవెన్యూ పరిధిలో భూ సర్వే చేసే సమయంలో రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. వంద మంది రైతులు పాస్‌బుక్‌ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. తుమ్మపాలలో అక్రమ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారులు గ్రామాల్లో పర్యటించి, అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకోవాలి. భూముల రీసర్వేలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. దీనిపై అధికార యంత్రంగా దృష్టి పెట్టాలి.

– పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ, తుమ్మపాల గ్రామం

23వ రోజుకు మత్స్యకారుల ఆందోళన

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్షలు 23వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం వారి దీక్షకు వైఎస్సార్‌సీపీకి చెందిన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, తదితరులు సంఘీభావం ప్రకటించారు. మత్స్యకారులతో పాటు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నెల రోజుల క్రితం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో నూటికి 90 శాతం మంది ఈ బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకించారని గుర్తు చేశారు. రాజయ్యపేట గ్రామస్తులే కాకుండా పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు కూడా తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు.

ఆరిపాకకు ఉత్తమ పంచాయతీ పురస్కారం



అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేల నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో ఉత్తమ పంచాయతీ పురస్కారం వరించింది. పంచాయతీ పరిధి పారిశుధ్య నిర్వాహణలో ఈ పురస్కారం లభించడంతో జిల్లా కేంద్రం అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా సోమవారం ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, పంచాయతీ కార్యదర్శి పైడిరాజుతో పాటు గ్రీన్ గార్డ్ హరి పాల్గొని అవార్డును అందుకున్నారు. సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆధ్వర్యంలో మౌలికవసతుల కల్పన విభాగంలో గతంలో కూడా ఉత్తమ పంచాయతీ అవార్డును పొందారు.